మాలీవుడ్‌లో 'మీటూ' ప్రకంపనలు

- ప్రముఖ నటులు, డైరెక్టర్లపై క్యాస్టింగ్ కౌచ్ ఆరోపణలు

తిరువనంతపురం: మలయాళం సినిమా ఇండస్ట్రీలో 'మీటూ' వ్యవహారం ప్రకంపనలు సృష్టిస్తున్నది. పలువురు ప్రముఖ నటులు, డైరెక్టర్లపై క్యాస్టింగ్ కౌచ్ ఆరోపణలు గుప్పుమంటున్నాయి. మాలీవుడ్‌లో మహిళలపై లైంగిక వేధింపులకు సంబంధించి జస్టిస్ హేమ కమిటీ రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించిన నివేదికను బహిరంగపర్చిన తర్వాత పలువురు మహిళా నటులు తమకు ఎదురైన దారుణ పరిస్థితులపై గళం విప్పుతున్నారు. ప్రముఖ నటులు ఎం ముఖేశ్(సీపీఎం ఎమ్మెల్యే), జయసూర్య, మునియన్‌పిళ్ల రాజు, ఇదవేళ బాబులు 2013లో ఓ సినిమా షూటింగ్ సందర్భంగా తనపై శారీరకంగా, మానసికంగా లైంగిక వేధింపులకు పాల్పడ్డారని మలయాళీ నటీ మిను మునీర్ సోమవారం ఆరోపించారు. జయసూర్య తనను కౌగిలించుకొన్నాడని, బలవంతంగా ముద్దుపెట్టాడని పేర్కొన్నారు. అసోసియేషన్ ఆఫ్ మలయాళం మూవీ ఆర్టిస్ట్స్(ఏఎంఎంఏ) సభ్యత్వం కోరితే, కార్యదర్శి ఇదవేళ బాబు తన ఫ్లాట్‌కు రమ్మన్నాడని, అదేవిధంగా ముఖేశ్ ఆయన చెప్పిన దానికి అంగీకరించనందుకు తనకు సభ్యత్వం రాకుండా చేశాడని ఆరోపించారు. అయితే మిను మునీర్ ఆరోపణల వెనుక స్వార్థ ప్రయోజనాలు ఉన్నాయని, ఆరోపణలపై దర్యాప్తు జరపాలని మునియన్‌పిళ్ల రాజు కోరారు. నటుడు, డైరెక్టర్ బాబురాజ్‌పై ఓ జూనియర్ ఆర్టిస్ట్ సంచలన ఆరోపణలు చేశారు. ఆయన తనపై లైంగిక దాడికి పాల్పడ్డాడని పేరు చెప్పేందుకు ఇష్టపడని ఓ యువతి పేర్కొన్నారు. తమపై లైంగిక వేధింపుల ఆరోపణలు రావడంతో డైరెక్టర్ రంజిత్, నటుడు సిద్ధిఖ్ ఏఎంఎంఏ పదవులకు ఆదివారం రాజీనామా చేశారు.

రూ.35కే టీబీ పరీక్ష

- కొత్త పరీక్ష విధానం అభివృద్ధి
- రెండున్నర గంటల్లో ఫలితం
- ఐసీఎంఆర్-ఆర్ఎంఆర్‌సీ ఘనత



న్యూఢిల్లీ: క్షయ వ్యాధి పరీక్షకు అస్సాంలోని దిబ్రుగఢ్‌లో ఉన్న ఐసీఎంఆర్-ప్రాంతీయ వైద్య పరిశోధన కేంద్రం(ఆర్ఎంఆర్‌సీ) కొత్త విధానాన్ని అభివృద్ధి చేసింది. దీని ద్వారా కేవలం రూ.35 ఖర్చుతో టీబీ పరీక్ష చేయొచ్చు. సీఆర్ఐఎస్‌పీఆర్ ఆధారిత టీబీ పరీక్షను రోగుల కఫంతో చేస్తారు. సులువుగా, మూడు దశల్లో ఈ పరీక్ష ఉంటుంది. రెండున్నర గంటల్లో దాదాపు 1,500 నమూనాల పరీక్షలను ఏకకాలంలో చేయవచ్చని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్(ఐసీఎంఆర్) వర్గాలు తెలిపాయి. ఇప్పటివరకు ఎక్కువగా మైక్రోస్కోపీ, నూక్లియిక్ యాసిడ్ ఆధారిత పరీక్ష పద్ధతులు పాటిస్తున్నారు. వీటి ద్వారా టీబీ లేదని నిర్ధారణ అయ్యేందుకు 42 రోజుల సమయం పడుతుంది. పైగా ఈ పరీక్షలకు ఖరీదైన యంత్రాలు అవసరం. తాము అభివృద్ధి చేసిన కొత్త పరీక్ష విధానంతో సులువుగా, వేగంగా, చౌకగా టీబీ పరీక్షను జరపొచ్చని ఐసీఎంఆర్ తెలిపింది. ఈ పరీక్ష విధానాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు గానూ సంస్థలు, పరిశ్రమలు, తయారీదారుల నుంచి ఆసక్తి వ్యక్తీకరణకు ఆహ్వానం తెలిపినట్టు పేర్కొన్నది. క్షయ వ్యాధి తీవ్రంగా మారకముందు గుర్తించడం చాలా అవసరమని, ఈ దిశగా కొత్త పరీక్ష విధానం కీలకంగా మారబోతున్నట్టు ఐసీఎంఆర్ భావిస్తున్నది.

9-11 తరగతుల మార్కులకు 12వ తరగతి ఫలితాల్లో వెయిటేజీ

ఎన్సీఈఆర్టీ ప్రతిపాదన

న్యూఢిల్లీ: 12వ తరగతి బోర్డు పరీక్షలకు ఎన్సీఈఆర్టీ సరికొత్త మూల్యాంకన నమూనాను ప్రతిపాదించింది. ఇందులో విద్యార్థులు 9 నుంచి 11 తరగతుల వరకు సాధించిన మార్కుల ఆధారంగా 12వ తరగతి ఫలితాల్లో వెయిటేజీ ఇవ్వడంతోపాటు వృత్తివిద్యకు, నైపుణ్య ఆధారిత శిక్షణకు మరింత ప్రాధాన్యమివ్వాలని పేర్కొన్నది. ఎడ్యుకేషన్ బోర్డుల మధ్య సమానత్వాన్ని నెలకొల్పడమే లక్ష్యంగా రూపొందించిన ఓ నివేదిక నుంచి ఈ ప్రతిపాదన తెరపైకి వచ్చింది. 12వ తరగతి ఫైనల్ ఫలితాల్లో గరిష్ఠంగా 9వ తరగతి నుంచి 15 శాతం, 10వ తరగతి నుంచి 20 శాతం, 11వ తరగతి నుంచి 25 శాతం మార్కులను కలపాలని ఇది సూచించింది.

బై..బై.. స్వీడన్!

- ఐరోపా దేశాన్ని వీడుతున్న భారతీయులు
- దేశానికి వచ్చేవారి కంటే వెళ్లేవారే ఎక్కువ
- జీవన వ్యయం పెరగడమే ప్రధాన కారణం



స్టాక్‌హోమ్: ఐరోపాలో స్థిరపడాలనుకునే భారతీయులకు ఆకర్షణీయంగా కనిపించే స్వీడన్ దేశం పట్ల క్రమంగా ఆసక్తి తగ్గిపోతున్నది. వీలైతే స్వీడన్ నుంచి బయటకు వెళ్లేందుకు ప్రవాస భారతీయులు ప్రయత్నిస్తున్నారు. 'స్టాటిస్టిక్స్ స్వీడన్' లెక్కలు ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ఈ వివరాల ప్రకారం.. 2024 జనవరి నుంచి జూన్ మధ్యకాలంలో స్వీడన్‌కు వచ్చిన భారతీయుల కంటే, ఈ దేశాన్ని వీడిన భారతీయుల సంఖ్యనే ఎక్కువగా ఉంది. ఈ ఆరు నెలల కాలంలో 2,837 మంది భారత్‌లో జన్మించిన వారు స్వీడన్‌ను విడిచిపెట్టి వెళ్లారు. గత ఏడాది ఇదే కాలంలో పోలిస్తే ఇది 171% ఎక్కువ.

కారణాలివే..

భారతీయులు స్వీడన్‌ను విడిచిపెట్టడానికి ఖర్చులు రోజురోజుకూ పెరుగుతూ ఉండటం, అందుబాటు ధరల్లో ఇండ్లు లభించకపోవడం వంటివే ప్రధాన కారణాలు. పైగా ఇటీవల స్వీడన్‌కు చెందిన పలు కంపెనీలు లేఆఫ్‌లు ప్రకటించాయి. ఆ తర్వాత కొత్త ఉద్యోగాలు వెతుక్కోవడం కష్టంగా మారడంతో కొందరు స్వీడన్‌ను వీడుతున్నట్టు తెలుస్తున్నది. ఇక, వర్క్ పర్మిట్ల విషయంలో ఇటీవల స్వీడన్ ప్రభుత్వం నిబంధనలను కఠినతరం చేయడం, జీవిత భాగస్వాములకు ఉద్యోగాలు దొరకడం కష్టంగా మారడం కూడా చాలామంది దేశం వీడటానికి కారణాలు.

బద్లాపూర్ ఘటనలో సీసీటీవీ ఫుటేజ్ మాయం

ముంబై, ఆగస్టు 26: మహారాష్ట్రలోని బద్లాపూర్ బడిలో చిన్నారులపై లైంగిక వేధింపుల ఘటన నేపథ్యంలో స్కూల్లోని గత 15 రోజుల సీసీటీవీ ఫుటేజ్ మాయమైందని రాష్ట్ర విద్యా మంత్రి దీపక్ ఖేసర్కర్ సోమవారం తెలిపారు. ఈ నెల 14న ఘటన గురించి క్లాస్ టీచర్‌కు, ప్రిన్సిపల్‌కు తెలిపామని బాధితుల కుటుంబాలు చెప్పుండగా.. ఈ నెల 16న తమకు సమాచారం అందిందని స్కూల్ యాజమాన్యం చెప్తున్నది. ఈ తేడాపై విచారణ జరుపుతున్నట్టు మంత్రి తెలిపారు. ఈ క్రమంలో సీసీటీవీ ఫుటేజ్ మాయం కావడం స్కూల్ బాధ్యతపై కొత్త ప్రశ్నలు లేవనెత్తింది.

రేప్ అంటే ఏంటని అడిగిన రెండు రోజులకే!

గువాహటి: అస్సాంలోని నాగావ్ జిల్లాలో ఈనెల 22న ట్యూషన్ నుంచి తిరిగి వస్తున్న ఓ బాలికపై కొంత మంది సామూహిక లైంగిక దాడికి పాల్పడిన ఘటనలో కొత్త విషయం వెలుగులోకి వచ్చింది. రేప్ అంటే ఏంటి ఆంటీ? అని బాలిక తనను అడిగిన రెండు రోజులకే ఆమెపై ఆఘాయిత్యం జరిగిందని బంధువు ఒకరు మీడియాతో మాట్లాడుతూ వెల్లడించారు. కోల్‌కతా ట్రైనీ డాక్టర్‌పై లైంగిక దాడి, హత్య ఘటన వార్తను చదివిన బాలిక ఈ మేరకు తనను ఈ ప్రశ్న అడిగిందని తెలిపారు.

పాలీగ్రాఫ్ టెస్టులో అబద్ధాలు!

కోల్‌కతా, ఆగస్టు 26: పాలీగ్రాఫ్ టెస్టులో కోల్‌కతా ట్రైనీ డాక్టర్ హత్యాచార ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్ అబద్ధాలు, పొంతనలేని సమాధానాలు ఇచ్చినట్టు సమాచారం. తాను ఘటన జరిగిన సెమినార్ హాల్‌కు వెళ్లే సమయానికే బాధిత వైద్యురాలు చనిపోయిందని, తర్వాత నేను భయంతో అక్కడి నుంచి పారిపోయానని లై డిటెక్టర్ టెస్టులో నిందితుడు చెప్పుకొచ్చాడని తెలిసింది. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పలు జాతీయ మీడియా సంస్థలు కథనాలు ఇచ్చాయి. ట్రైనీ డాక్టర్‌పై హత్యాచార ఘటన జరిగిన రోజు రాత్రి ముందు నిందితుడు సంజయ్ రాయ్ మరో మహిళపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని సీబీఐ వర్గాలు పేర్కొన్నాయి. మరోవైపు, టీఎంసీ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ మైనర్ కుమార్తెకు లైంగిక దాడి బెదిరింపులు వచ్చాయి. దీన్ని బెంగాల్ పిల్లల హక్కుల పరిరక్షణ కమిషన్ సుమోటోగా స్వీకరించింది. పోక్సో చట్టం కింద కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరింది.

రైతాంగ ఉద్యమంతో బంగ్లా పరిస్థితులు!

- కేంద్రం కఠిన చర్యలు తీసుకోకుంటే అదే జరిగేది
- రైతు ఆందోళనల కొనసాగింపు వెనుక విదేశీ కుట్ర
- బీజేపీ ఎంపీ, నటి కంగనా వివాదాస్పద వ్యాఖ్యలు
- వెంటనే దిద్దుబాటు చర్యలకు దిగిన కమలం పార్టీ
- అది పార్టీ అభిప్రాయం కాదని ప్రకటన విడుదల

న్యూఢిల్లీ, ఆగస్టు 26: రైతాంగ ఉద్యమంపై బీజేపీ ఎంపీ, ప్రముఖ నటి కంగనా రనౌత్ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం దేశంలో కొనసాగుతున్న రైతుల ఉద్యమంపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోకపోయి ఉంటే, కేంద్ర నాయకత్వం బలంగా లేకుంటే భారత్‌లో కూడా బంగ్లాదేశ్ పరిస్థితులు తలెత్తేవని వ్యాఖ్యానించారు. నూతన వ్యవసాయ చట్టాలను కేంద్రం వెనక్కు తీసుకొన్నప్పటికీ స్వార్థ ప్రయోజనాలు ఆశించేవారు, విదేశీ శక్తులు రైతాంగ ఉద్యమాన్ని ఎగదోస్తున్నాయని ఆరోపించారు. మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమంలో మృతదేహాలు వేలాడుతూ కనిపించాయని, మహిళలపై లైంగిక దాడులు చోటుచేసుకొన్నాయని ఆరోపిస్తూ తన ఎక్స్ ఖాతాలో వీడియోను పోస్టు చేశారు. 'బంగ్లాదేశ్‌లో ఏం జరిగిందో, మన దేశంలో కూడా జరిగే అవకాశం ఉన్నది. విదేశీ శక్తులు, స్వార్థ శక్తులు ఇందుకు కుట్ర పన్నాయి. దేశం కుక్కల పాలైనా వారికేం పట్టదు' అని అన్నారు.

హర్యానా అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ నుంచి వెంటనే స్పందన

రైతుల ప్రభావం అధికంగా ఉండే హర్యానాలో అసెంబ్లీ ఎన్నికలు త్వరలో జరుగనున్న నేపథ్యంలో కంగన వ్యాఖ్యలు అధికార బీజేపీకి తలనొప్పిగా మారాయి. కంగన వ్యాఖ్యలపై దుమారం రేగడంతో కమలం పార్టీ వెంటనే స్పందించింది. దిద్దుబాటు చర్యలు చేపట్టింది. కంగన వ్యాఖ్యలు పార్టీ అభిప్రాయం కాదని, ఆమె వ్యాఖ్యలను అంగీకరించడం లేదని బీజేపీ ఓ ప్రకటన విడుదల చేసింది. పార్టీ పాలసీ అంశాలపై మాట్లాడేందుకు అధికారం కానీ, అనుమతి గానీ ఆమెకు లేదని పేర్కొన్నది. వివాదాస్పద, రెచ్చగొట్టే వ్యాఖ్యలకు దూరంగా ఉండాలని కంగనాకు పంజాబ్ బీజేపీ సీనియర్ నేత హర్జిత్ గరేవాల్ సూచించారు. రైతుల గురించి మాట్లాడే పని ఆమెది కానని, కంగన వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతంగా పరిగణించాలని, ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షాలు రైతు పక్షపాతులు అని చెప్పుకొచ్చారు. ప్రతిపక్షాలు తమకు వ్యతిరేకంగా పనిచేస్తున్నాయని, కంగన వ్యాఖ్యలు కూడా అదేవిధంగా ఉన్నాయని అసహనం వ్యక్తం చేశారు.

మోదీ క్షమాపణలు చెప్పాలి: ఏఐకేఎస్

రైతాంగ ఉద్యమంపై బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ వ్యాఖ్యలను ఏఐకేఎస్ ఖండించింది. దేశ వ్యవసాయ రంగాన్ని మింగేయాలనుకొంటున్న బయటి, అంతర్గత బాస్‌లను సంతోషపెట్టేందుకే ఆమె ఈ విధమైన వ్యాఖ్యలు చేశారని ఏఐకేఎస్ అధ్యక్షుడు అశోక్ ధావలే ఓ ప్రకటనలో విమర్శించారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమాన్ని మోసం చేసిన, బ్రిటీషర్లకు తొత్తులుగా వ్యవహరించిన మతతత్వ శక్తులకు దేశ రైతాంగం, కార్మికుల దేశభక్తిని ప్రశ్నించే నైతికత లేదని అన్నారు. కంగన వ్యాఖ్యలకు ప్రధాని మోదీ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

ఇదే తొలిసారి కాదు..

రైతాంగ ఉద్యమం, రైతుల గురించి వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం కంగనకు ఇదే తొలిసారి కాదు. మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన రైతాంగ ఉద్యమాన్ని ఆమె తీవ్రంగా వ్యతిరేకించారు. 2020లో ఉద్యమంలో పాల్గొన్న ఓ మహిళా రైతును 'బిల్కిస్ బానో'గా పేర్కొన్న ఆమె.. డబ్బు లిచ్చి ఆందోళనలకు తీసుకొచ్చారని పేర్కొన్నారు. రైతు వ్యతిరేక వ్యాఖ్యల నేపథ్యంలో ఆమె ఇటీవల మండీ ఎంపీగా ఎన్నికైన తర్వాత కంగనకు చండీగఢ్ ఎయిర్‌పోర్టులో చేదు అనుభవం ఎదురైంది. ఓ సీఐఎస్ఎఫ్ మహిళా సిబ్బంది ఆమె చెంపపై చెళ్లుమనిపించింది. ఈ ఘటన దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన విషయం తెలిసిందే.

చంద్రుడిపై మట్టితో మంచినీరు

బీజింగ్, ఆగస్టు 26: చంద్రుడిని మానవులకు నివాసయోగ్యంగా మార్చే దిశగా చైనాకు చెందిన శాస్త్రవేత్తలు సరికొత్త ప్రయోగం చేపట్టారు. మానవ మనుగడకు కీలకమైన నీటి వనరులను సృష్టించేందుకు ప్రయత్నం చేస్తున్నారు. చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్(సీఏఎస్) లోని నింగ్‌బో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెటీరియల్స్ టెక్నాలజీ అండ్ ఇంజినీరింగ్‌కు చెందిన శాస్త్రవేత్తలు చంద్రుడి ఉపరితలం నుంచి సేకరించిన మట్టి నుంచి నీటిని వెలికితీశారు. చాంగ్ ఈ-5 మిషన్‌లో భాగంగా చంద్రుడి ఉపరితలం నుంచి తెచ్చిన మట్టిని 1,200 కెల్విన్‌కు పైగా వేడి చేసి, ప్రత్యేకమైన ప్రక్రియ ద్వారా నీటిని తీసినట్టు శాస్త్రవేత్తలు తెలిపారు. ఒక టన్ను మట్టితో దాదాపు 500 లీటర్ల తాగు నీటిని తయారుచేయవచ్చని వీరు పేర్కొన్నారు. చంద్రుడిపై మట్టి నుంచి తయారుచేసిన నీటిని హైడ్రోజెన్, ఆక్సిజన్‌గా కూడా వేరు చేయవచ్చని శాస్త్రవేత్తలు చెప్పారు.

భారత్‌లో టెలిగ్రామ్‌పై నిషేధం?

న్యూఢిల్లీ, ఆగస్టు 26: ప్రముఖ మెసేజింగ్ యాప్‌లలో ఒకటైన టెలిగ్రామ్ భారత్‌లో నిషేధానికి గురయ్యే అవకాశాలు ఉన్నాయి. మోసాలు, జూదం వంటి అక్రమ కార్యకలాపాలకు ఈ యాప్‌ను వినియోగిస్తున్నారని పెద్ద ఎత్తున ఆరోపణలు ఉన్నాయి. ఈ ఆరోపణలపై ప్రస్తుతం హోంశాఖ, ఐటీ శాఖ సహకారంతో ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్(ఐ4సీ) విచారణ జరుపుతున్నది. టెలిగ్రామ్‌లో అక్రమ కార్యకలాపాలతో పాటు ఇది భారతదేశ ఐటీ నిబంధనలను పాటిస్తున్నదా అనేది విచారణలో తేలనుంది. ఒకవేళ నిబంధనలకు విరుద్ధంగా టెలిగ్రామ్ పని చేస్తుందని విచారణలో వెల్లడైతే ఈ యాప్‌ను నిషేధించే అవకాశం ఉంది. కాగా, మానవ అక్రమ రవాణా, మోసాలు, సైబర్ బెదిరింపులు వంటి వాటిలో ప్రమేయం ఉందనే ఆరోపణలతో మూడు రోజుల క్రితం టెలిగ్రామ్ వ్యవస్థాపకుడు, సీఈఓ పవెల్ దురోవ్‌ను ఫ్రెంచ్ అధికారులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే.

ఎన్సీ 51.. కాంగ్రెస్ 32

జమ్ముకశ్మీర్‌లో సీట్ల సర్దుబాటు

శ్రీనగర్, ఆగస్టు 26: జమ్ముకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్సీ), కాంగ్రెస్ మధ్య ఎట్టకేలకు సీట్ల పంపకంపై ఓ అంగీకారం కుదిరింది. ఇక్కడ జరగనున్న ఎన్నికల్లో 51 స్థానాల్లో ఎన్సీ, 32 స్థానాల్లో కాంగ్రెస్ పోటీ చేయబోతున్నట్టు ఇరు పార్టీల నేతలు సోమవారం ప్రకటించారు. మరో ఐదు స్థానాల్లో రెండు పార్టీలూ స్నేహపూర్వక పోటీకి దిగనున్నాయి. మరోవైపు, 44 మందితో తొలుత జాబితాను ప్రకటించిన బీజేపీ.. పార్టీలో వ్యతిరేకత రావడంతో దానిని ఉపసంహరించుకుంది. 16 మందితో మళ్లీ జాబితాను విడుదల చేసింది.

లద్దాఖ్‌లో ఐదు కొత్త జిల్లాలు

న్యూఢిల్లీ: కేంద్ర పాలిత ప్రాంతం లద్దాఖ్‌లో ఐదు కొత్త జిల్లాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు కేంద్ర హోం మంత్రి అమిత్ షా సోమవారం ప్రకటించారు. 'జన్స్కార్, ద్రాస్, శామ్, నుబ్ర, చాంగ్‌తంగ్ పేర్లతో ఏర్పడే కొత్త జిల్లాలు పరిపాలనను ప్రతి మూలకు తీసుకెళ్తాయి' అని ఆయన ఎక్స్‌లో పేర్కొన్నారు. జమ్ము కశ్మీర్‌ను 2019లో విభజించి.. జమ్ముకశ్మీర్, లద్దాఖ్ అనే రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా మార్చారు.

బస్సులు ఆపి.. ప్రయాణికులను కాల్చేసి

- పాకిస్థాన్‌లో బలూచ్ లిబరేషన్ ఆర్మీ దుశ్చర్య
- పంజాబ్ ప్రావిన్స్‌కు చెందిన వారే లక్ష్యంగా దాడులు
- 23 మంది ప్రజలు సహా 38 మంది మృతి
- 'ఆపరేషన్ హెరాఫ్' పేరుతో మారణకాండ

బలూచిస్థాన్‌లో సాయుధులు నిప్పుపెట్టడంతో దగ్ధమైన వాహనం

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌లో బలూచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ)రెచ్చిపోయింది. 'ఆపరేషన్ హెరాఫ్' పేరుతో బలోచిస్థాన్ ప్రావిన్స్‌లో పెద్ద ఎత్తున దాడులకు తెగబడింది. సైనిక స్థావరాలు, పోలీస్ స్టేషన్లను లక్ష్యంగా చేసుకున్నది. ఈ క్రమంలో రహదారులను ఆధీనంలోకి తీసుకొని సాధారణ ప్రయాణికులనూ హతమార్చింది. దాడుల్లో 23 మంది ప్రజలు సహా 38 మంది మరణించారు. అసిస్టెంట్ కమిషనర్ నజీబ్ కాకేర్ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం ఉదయం ముసఖైల్ జిల్లాలోని రరాషామ్ ప్రాంతంలో పంజాబ్ - బలూచిస్థాన్ రహదారిని సాయుధులు అధీనంలోకి తీసుకున్నారు. బస్సులు, వ్యాన్లు, ట్రక్కులను కలిపి మొత్తం 22 వాహనాలను నిలిపివేసి, ప్రయాణికులను కిందకు దించేశారు. ప్రయాణికుల గుర్తింపును తనిఖీ చేసి, పంజాబ్ ప్రావిన్స్, ఖైబర్ పఖ్తుంఖ్వాకు చెందిన వారిని గుర్తించి కాల్పులు జరిపారు. కాల్పుల్లో 23 మంది మృతి చెందినట్టు గుర్తించారు. మృతుల్లో నలుగురు సైనికులు కాగా, మిగతా వారు సాధారణ ప్రజలు. కలత్ జిల్లాలో బీఎల్ఏ దాడుల్లో మరో 11 మంది మరణించగా, వీరిలో నలుగురు సాధారణ పౌరులని ఎస్సీ దష్టి తెలిపారు. ఆదివారం రాత్రి మస్తంగ్, కలత్, పస్ని, సున్‌స్టార్ పోలీస్ స్టేషన్లపై బీఎల్ఏ కాల్పులు జరిపింది. సిబి, పంజగర్, తర్బత్ బేలా, క్వెట్టాలో గ్రెనేడ్ దాడులు చేసింది. ఈ దాడుల్లో నలుగురు భద్రతా సిబ్బంది మరణించారు.

102 మంది పాక్ జవాన్లను హతమార్చాం

బేలాలోని పాక్ ఆర్మీ క్యాంపుపై పెద్ద ఎత్తున పేలుళ్లు జరిపి 40 మంది పాక్ సైనికులను హతమార్చినట్టు బీఎల్ఏ ప్రకటించింది. ఆర్మీ స్థావరంలోని చాలా భాగాన్ని ఆధీనంలోకి తీసుకున్నట్టు వెల్లడించింది. తమ దాడుల్లో 102 మంది పాకిస్థానీ సైనికులు మరణించి పేర్కొంది. కాగా, 14 మంది తమ సైనికులు మరణించారని, 21 మంది ఉగ్రవాదులను హతమార్చామని పాక్ ఆర్మీ తెలిపింది.

మూడో ప్రపంచ యుద్ధం దిశగా వెళ్తున్నాం: ట్రంప్

వాషింగ్టన్, ఆగస్టు 26: పశ్చిమాసియాలో నెలకొన్న సంక్షోభం మరింత ముదురుతున్నదని, మూడో ప్రపంచ యుద్ధం సంభవించే ప్రమాదముందని అమెరికా అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ ఆందోళన వ్యక్తం చేశారు. హెజ్బొల్లా మిలిటెంట్ గ్రూప్, ఇజ్రాయెల్ బలగాల మధ్య భీకరపోరు మొదలైన కొన్ని గంటల్లోనే ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. పశ్చిమాసియా సంక్షోభాన్ని ఎదుర్కొనటంలో అమెరికా విధానంపై ట్రంప్ అనుమానాలు వ్యక్తం చేశారు. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కాలిఫోర్నియా బీచ్‌లో హాయిగా నిద్రపోతున్నాడని మండిపడ్డారు. 'స్లీపీ జో' అంటూ 'ఎక్స్'లో సందేశాన్ని పోస్ట్ చేశారు. అమెరికా నేతలు నిద్రమత్తులో ఉన్నారని, అందువల్లే మూడో ప్రపంచ యుద్ధం ముంచుకొస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఉక్రెయిన్‌పై విరుచుకుపడ్డ రష్యా

- 100కుపైగా క్షిపణులు, డ్రోన్లతో దాడి
- పలు నగరాల్లో నిలిచిన విద్యుత్తు సరఫరా

9/11 దాడులను గుర్తుతెచ్చేలా రష్యాలోని ఓ భవనంపై ఉక్రెయిన్ డ్రోన్ దాడి

కీవ్: ఉక్రెయిన్-రష్యా యుద్ధం తీవ్రరూం దాల్చింది. ఆదివారం రాత్రి నుంచి రాజధాని కీవ్ సహా ఉక్రెయిన్ నగరాలపై రష్యా సైన్యం భారీ ఎత్తున క్షిపణి, డ్రోన్లతో విరుచుకుపడుతున్నది. ఈ దాడుల్లో కనీసం నలుగురు చనిపోయారని, పదుల సంఖ్యలో తీవ్రంగా గాయపడ్డారని ఉక్రెయిన్ తెలిపింది. రాజధాని కీవ్‌పై రష్యా 100కుపైగా క్షిపణులు, డ్రోన్లను ప్రయోగించింది. దీంతో పౌరులు ఇండ్లలో నుంచి బయటకు పరుగులు తీశారు. ఇక్కడి మెట్రో స్టేషన్లో తలదాచుకుంటున్నారు. రష్యా క్షిపణులు, డ్రోన్లను కూల్చేందుకు యూరప్ దేశాలు ఉక్రెయిన్‌కు సాయం చేయాలని ఆ దేశ అధ్యక్షుడు జెలెన్‌స్కీ అభ్యర్థించారు. విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాలు సహా కీలక మౌలిక వసతులను రష్యా టార్గెట్ చేసిందన్నారు. దీంతో వివిధ నగరాల్లో విద్యుత్తు సరఫరా నిలిచిపోయిందని చెప్పారు. మరోవైపు, 9/11 దాడులను గుర్తుతెచ్చేలా రష్యాలోని సరటోవ్‌లో 38 అంతస్థుల భవనంపై ఉక్రెయిన్ డ్రోన్ దాడి చేసింది. 2001 సెప్టెంబర్ 11న అమెరికాలోని వరల్డ్ ట్రేడ్ సెంటర్‌పై అల్‌ఖైదా దాడి చేసిన విషయం తెలిసిందే.

ఢిల్లీలో కేదార్‌నాథ్ ఆలయ నిర్మాణంపై వెనక్కి

డెహ్రాడూన్, ఆగస్టు 26: కేదార్‌నాథ్ గుడిని పోలిన ఆలయాన్ని ఢిల్లీలో నిర్మించాలన్న ప్రతిపాదనపై పెద్ద ఎత్తున విమర్శలు రావటంతో ఉత్తరాఖండ్ ప్రభుత్వం వెనక్కి తగ్గింది. ఢిల్లీలోని బురారీలో తలపెట్టిన ఆలయ నిర్మాణ ప్రణాళికను ఉపసంహరించుకుంటున్నట్టు కేదార్‌నాథ్ ధామ్ ఢిల్లీ ట్రస్ట్ అధ్యక్షుడు సుమన్ మిట్టల్ సోమవారం వెల్లడించారు. ఉత్తరాఖండ్ ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేక వచ్చిందని, ప్రజల మత విశ్వాసాలు దెబ్బతింటాయని తాము భావిస్తున్నామని సుమన్ మిట్టల్ అన్నారు.

బుర్కినా ఫాసోలో 100 మంది ఊచకోత

దాడి చేసింది మేమే: అల్‌ఖైదా

అబుజా(నైజీరియా), ఆగస్టు 26: అంతర్యుద్ధంతో సతమతమవుతున్న బుర్కినా ఫాసోలో మళ్లీ హింస చెలరేగింది. బర్సాలోగో పట్టణం వద్ద అల్‌ఖైదాకు చెందిన జిహాదీలు ఊచకోతకు పాల్పడ్డారు. జిహాదీ గ్రూప్ జరిపిన తుపాకీ కాల్పుల్లో కనీసం 100 మంది చనిపోయారని, మృతుల్లో గ్రామస్థులు, సైనికులు ఉన్నారని ఆ ప్రాంతానికి చెందిన రీజినల్ స్పెషలిస్ట్ ఒకరు తెలిపారు. బర్సాలోగో వద్ద శనివారం భద్రతా బలగాలు, గ్రామస్థులు కలిసి కందకాలు తవ్వుతుండగా, అల్‌ఖైదాకు చెందిన జిహాదీ గ్రూప్ 'జేఎన్ఐఎమ్' ఫైటర్లు ఆ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకొని.. కాల్పులకు తెగబడ్డారని సెక్యూరిటీ థింక్ ట్యాంక్ నిపుణుడు వాజిం నాజర్ తెలిపారు. ఈ దాడి తామే చేశామని, బర్సాలోగో పట్టణంపై పట్టుసాధించామని అల్‌ఖైదా ప్రకటించుకుంది. దేశంలో సగానికిపైగా భూభాగం అక్కడి ప్రభుత్వ నియంత్రణలో లేదు. అల్‌ఖైదా, ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదులు వేలాది మందిని పొట్టనబెట్టుకున్నాయి. 'జిహాదీ గ్రూపుల దాడిలో సైనికులు, సామాన్య పౌరులు చనిపోయారు. వైమానిక, పదాతి దళంతో దాడిని ఎదుర్కొంటున్నాం' అని రక్షణ మంత్రి చెప్పారు.

ఉత్తర కొరియా సూసైడ్ డ్రోన్ పరీక్ష

సియోల్: రష్యాలో తయారైన దిగా చెప్తున్న సూసైడ్ డ్రోన్‌ను దేశాధినేత కిమ్ పర్యవేక్షణలో ఉత్తర కొరియా పరీక్షించినట్టు ఆ దేశ మీడియా సోమవారం పేర్కొంది. శత్రువు కదలికలపై వ్యూహాత్మక భూతల పర్యవేక్షణ, బహుళ విధ అవసరాల కోసం మరిన్ని సూసైడ్ డ్రోన్లను అభివృద్ధి, ఉత్పత్తి చేయాల్సిన అవసరం ఉందని కిమ్ జోంగ్ అన్నట్టు అధికార కొరియన్ సెంట్రల్ న్యూస్ ఏజెన్సీ తెలిపింది.

బంగ్లాలో మళ్లీ అల్లర్లు

- విద్యార్థులు, పారామిలిటరీ సిబ్బంది మధ్య ఘర్షణ
- 50 మందికి పైగా గాయాలు

ఢాకా: బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. తమ ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని కోరుతూ సచివాలయం వద్ద ఆందోళన చేస్తున్న అన్సార్ అనే పారామిలిట